క్లుప్తంగా

రాష్ట్ర స్థాయి సైన్స్‌డేకు విద్యార్థిని ఎంపిక



విద్యార్థినిని అభినందిస్తున్న ఉపాధ్యాయులు

చిలుకూరు : మండలంలోని బేతవోలు జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన నందిని జిల్లా కేంద్రంలో బుధవారం నిర్వహించిన జిల్లా స్థాయి సైన్స్ డే సెలబ్రేషన్‌లో ఉత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయి సైన్స్ డే సెలబ్రేషన్‌కు ఎంపికైనట్లు పాఠశాల హెచ్‌ఎం తేజోరాం, సైన్స్ టీచర్ శ్రీనివాస్ గురువారం తెలిపారు. ఈ సందర్భంగా నందిని, గైడ్‌టీచర్ శ్రీనివాస్‌ను తోటి ఉపాధ్యాయులు, గ్రామస్తులు అభినందించారు.

ఆలయ కమిటీ ఎన్నిక

గరిడేపల్లి : మండల పరిధిలోని కీతవారిగూడెం గ్రామంలో గల శ్రీపార్వతీ సమేత రామలింగేశ్వరస్వామి దేవాలయం కమిటీని గురువారం ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా సభ్యులు ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రమాణస్వీకారం చేశారు. కమిటీ అధ్యక్షుడిగా పాలేలి సూరయ్య, ఉపాధ్యక్షుడిగా చింతకాయల శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా తోడుపునూరి కృష్ణమూర్తి, కార్యదర్శిగా మైలారిశెట్టి భద్రయ్య, సహాయ కార్యదర్శిగా గుండు సైదయ్య, కోశాధికారిగా జుట్టుకొండ చంద్రయ్య, ప్రధాన సలహాదారులు రాయపోలు శ్రీరామయ్య, గౌరవ అధ్యక్షుడు కొంగరి శ్రీనివాస్‌తో పాటు పలువురు సభ్యులు ఎన్నికయ్యారు.

సీపీఎం నాయకుడు తమ్మినేనికి పరామర్శ

మునగాల : ఇటీవల గుండెపోటుకు గురై ఆస్పత్రిలో చికిత్స పొంది తన నివాసం తెల్దారుపల్లిలో విశ్రాంతి తీసుకుంటున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రంను గురువారం మండలానికి చెందిన పలువురు పార్టీ నాయకులు పరామర్శించారు. త్వరగా కోలుకోని తిరిగి ప్రజాతంత్ర ఉద్యమాల్లో పాల్గొనాలని ఆకాంక్షించారు. పరామర్శించిన వారిలో పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు మేదరమెట్ల వెంకటేశ్వరరావు, జిల్లా కమిటీ సభ్యులు ఎం.ముత్యాలు, కౌలుదారుల సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు షేక్ సైదా, ఉసిరికాయల శ్రీనివాస్ ఉన్నారు.

సబ్ జూనియర్ కబడ్డీ పోటీలకు 11న ఎంపిక

హుజూర్‌నగర్ : చింతలపాలెం మండల కేంద్రంలో (మల్లారెడ్డిగూడెం) ఈనెల 16నుంచి 19వరకు నిర్వహించే 33వ సబ్ జూనియర్ రాష్ట్ర స్థాయి అంతర్ జిల్లాల కబడ్డీ పోటీలకు ఈనెల 11న హుజూర్‌నగర్‌లో జిల్లా సబ్ జూనియర్ బాల బాలికల జట్ల ఎంపిక నిర్వహిస్తున్నట్లు కబడ్డీ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బెల్లంకొండ రామచందర్‌గౌడ్, నామా నరసింహారావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఎంపికలో పాల్గొనే క్రీడాకారులు 16ఏళ్లలోపు వయస్సు, 55కేజీలలోపు బరువు కలిగి ఉండాలన్నారు. ఎంపికకు హాజరయ్యే క్రీడాకారులు తమ వెంట ఆధార్ కార్డు జీరాక్స్ తీసుకురావాలని తెలిపారు.

హైకోర్టు జడ్జీలను కలిసిన అసోసియేషన్ నాయకులు



హైకోర్టు జడ్జీలను కలిసిన కోదాడ బార్ అసోసియేషన్ నాయకులు

కోదాడరూరల్ : కోదాడ కోర్టులో నెలకొన్న పలు పెండింగ్ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ స్థానిక బార్ అసోసియేషన్ నాయకులు గురువారం హైకోర్టు జడ్జీలు జస్టిస్ కార్తీక్, జస్టిస్ వినోద్‌కుమార్, జస్టిస్ లక్ష్మణ్‌ను కలిశారు. అదే విధంగా నూతన కోర్టు భవన నిర్మాణ పనులను వెంటనే ప్రారంభించాలని, త్వరలో ప్రారంభించనున్న సబ్‌కోర్టు ప్రారంభోత్సవానికి రావాలని వారిని ఆహ్వానించారు. జడ్జిలను కలిసిన వారిలో కోదాడ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు దేవబత్తిని నాగార్జున, ఉపాధ్యక్షుడు గాలి శ్రీనివాసనాయుడు, ప్రధాన కార్యదర్శి సాధు శరత్‌బాబు, రాధాకృష్ణమూర్తి, సుధాకర్‌రెడ్డి, రాజు, శ్రీధర్ ఉన్నారు.

డ్రగ్స్, గంజాయి నిర్మూలనకు కృషి చేయాలి

గరిడేపల్లి : ప్రతిఒక్కరూ గంజాయి, డ్రగ్స్ మత్తు పదార్థాల నిర్మూలనకు కృషి చేయాలని ఎస్‌ఐ వెంకట్‌రెడ్డి అన్నారు. గురువారం మండల కేంద్రంతో పాటు మండల పరిధిలోని కీతవారిగూడెం, రాయినిగూడెం, పోనుగోడు గ్రామాల్లో గంజాయి, డ్రగ్స్‌పై ప్రజలకు అవగాహన కల్పించారు. అనంతరం పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వాస్తుహోమం

గరిడేపల్లి : మాసశివరాత్రి సందర్భంగా మండలంలోని కీతవారిగూడెంలోని శివాలయంలో స్వామివారికి మహాన్యాస పూర్వకంగా ఏకదాశరుద్రాభిషేకం బిల్వార్చనము సహస్త్ర నామర్చాన, అమ్మవారికి కుంకుమపూజ, శ్రీలక్ష్మీగణపతి రుద్ర నవగ్రహ వాస్తు హోమం, పుర్ణాహుతి నిర్వహించారు. కార్యక్రమంలో దేవాలయ కమిటీ సభ్యులు, మహిళా భక్తులు స్వామివారిని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు.

గ్రామాల్లో కోతుల బెడద

- ఇళ్లలోకి చొరబడి బీభత్సం
- వీధుల్లో ప్రజలను గాయపరుస్తున్న వానరాలు
- నియంత్రణ చర్యలు తీసుకోవాలని వినతి



నారాయణగూడెంలో ఇంటిపై సంచరిస్తున్న వానర సైన్యం

మునగాల : మండలంలో కోతుల బెడద రోజురోజుకు పెరిగిపోతుంది. కోతులను నివారించేందుకు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఆయా గ్రామాల్లో కోతులు గుంపులుగుంపులుగా తిరుగుతూ ప్రజలపై దాడులు చేస్తున్నాయి. మహిళలు, చిన్నారుల చేతిల్లోని వస్తులను లాక్కుని గాయపరుస్తున్నాయి. అడ్డుకునే ప్రయత్నం చేస్తే వారిపై తిరగబడుతున్నాయి. రోడ్లపై వ్యాపారాలు సాగించే వారు కోతులతో నానా అవస్థలు పడుతున్నారు. మీదపడి పండ్లు, కూరగాయలు ఇతర వస్తువులను ఎత్తుకెళ్తున్నాయి. ఇళ్ల తలుపులు తెరిచి ఉంటే ఇక అంతే సంగతులు ఇంటిలోకి చొరబడి అందిన కాడికి తినుబండాలను ఎత్తుకెళుతున్నాయి. గ్రామాల్లో ఇళ్ల ఎదుట ఎప్పుడూ చేతుల్లో కర్రలతో కాపాలా ఉండాల్సిన పరిస్థితి నెలకొంది. గృహాల పైకప్పులను ధ్వంసం చేస్తూ వీరంగం సృష్టిస్తున్నాయి. కోతుల బారి నుంచి ఇంటిపైకప్పులను కాపాడుకొనేందుకు దట్టమైన కంపను ఏర్పాటు చేయాల్సివస్తుందని ప్రజలు వాపోతున్నారు. ఇళ్లల్లో పండ్లచెట్లు, కూరగాయల మొక్కలు నాశనం చేస్తున్నాయి. మహిళలు కూరగాయలు, పండ్లు కొనుగోలు చేసుకుని వెళ్తుంటే వెంటాడి భయపెడుతున్నాయి. కోతుల భయంతో మహిళలు, పిల్లలు, వృద్ధులు వీధుల్లోకి రావాలంటేనే జంకుతున్నారు. ఇటీవల పలు గ్రామాల్లో పలువురిని కోతులు గాయపరచడంతో ఆస్పత్రుల్లో చికిత్సలు పొందుతున్నారు. కోతుల బారి నుంచి కాపాడేందుకు గ్రామ పంచాయతీ అధికారులు అవసరమైన చర్యలు చేపట్టాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

కోతుల బారి నుంచి కాపాడాలి



“మండల కేంద్రంలోని శ్రీరామలింగేశ్వర హనుమాన్ దేవాలయంలో కోతుల బెడదతో భక్తులు తీవ్ర ఇబ్బందలు పడుతున్నారు. భక్తుల చేతుల్లోని ప్రసాదాలు లాక్కెళ్తున్నాయి. భక్తుల మీదపడి భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి. కోతుల కోసం ప్రత్యేకంగా కాపాలా ఉండాల్సివస్తోంది. కోతుల బారి నుంచి కాపాడాలి.

– తూముల వీరస్వామి, దేవాలయ కమిటీ చైర్మన్, మునగాల

వానరాలతో ఇబ్బందులు పడుతున్నాం



“గ్రామంలో వానరాల బెడదతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. కోతులు ఆహారం దొరకని సమయంలో ప్రజలపై ఎగబడి గాయపరుస్తున్నాయి. గ్రామంలో రోజుకో వీధి చొప్పున కోతులు సంచరిస్తూ బీభత్సం సృష్టిస్తున్నాయి. కోతులను గ్రామం నుంచి పారదోలేందుకు ఎవరు ముందుకు రావడం లేదు. గ్రామపంచాయతీ అధికారులు స్పందించాలి.

– షేక్ దస్తగిరి, బరాఖత్‌గూడెం

ఉద్యోగులకు బదిలీలు సహజం



బదిలీపై వెళ్తున్న శ్రీధర్‌ను సన్మానిస్తున్న కలెక్టర్ వెంకట్రావు

దురాజ్‌పల్లి : ప్రభుత్వ ఉద్యోగులకు బదిలీలు సహజమని కలెక్టర్ ఎస్. వెంకట్రావు అన్నారు. జిల్లా ఏర్పాటు నుంచి జిల్లా ఉద్యానవనశాఖ అధికారిగా విధులు నిర్వహించి ఇటీవల బదిలీపై అదిలాబాద్ వెళ్లిన శ్రీధర్‌గౌడ్ ఆత్మీయ వీడ్కోలు సమావేశాన్ని గురువారం జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. జిల్లాలో ఉద్యానవన సాగును పెంచడంలో శ్రీధర్ పాత్ర గొప్పదని అన్నారు. ముఖ్యంగా ఆయిల్‌ఫామ్ రైతులకు అవగాహన కల్పించి సాగు వైపు మళ్లించారని తెలిపారు. భవిష్యత్‌లో కూడా విజయవంతంగా విధులు నిర్వహించి పనిచేసిన చోట మంచి పేరు తెచ్చుకోవాలని ఆకాంక్షించారు. అనంతరం శ్రీధర్‌గౌడ్‌ను శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌డీఓ కిరణ్‌కుమార్, డీపీఓ రామారావు నాయక్, డీఈఓ అశోక్, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ శిరీష, ఎస్సీ అభివృద్ధి అధికారి దయానందరాణి, డీసీఓ శ్రీధర్, డీటీడీఓ శంకర్ తదితరులు పాల్గొన్నారు.

మెనూ ప్రకారం భోజనం అందించాలి



భోజనాన్ని పరిశీలిస్తున్న ఎంపీపీ రాణి

కోదాడరూరల్ : విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని ఎంపీపీ మల్లెల రాణి బ్రహ్మయ్య అన్నారు. గురువారం మండల పరిధిలోని గుడిబండలో గల ఉన్నత పాఠశాలతో పాటు అంగన్‌వాడీ కేంద్రాలను ఆమె తనిఖీ చేసి మాట్లాడారు. విద్యార్థులను పలు ప్రశ్నలు అడిగి సమాధానాలు తెలుసుకున్నారు. భోజనం మెనూ ప్రకారం పెడుతున్నారా, వసతులు అన్ని సక్రమంగా ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. అదే విధంగా కాపుగల్లులో ప్రాథమిక ఆరోగ్యకేంద్రం, నర్సరీ, పీపీవీలను పరిశీలించి పలు వివరాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు తూమాటి వరప్రసాద్‌రెడ్డి, వెంకటనారాయణ, వెంకటేశ్వరరెడ్డి, శ్రీనివాసరెడ్డి, కొల్లు క్షత్రజ్ఞ, అశోక్, నాగరాజు ఉన్నారు.

కార్మికులకు ప్రభుత్వం భరోసా కల్పించాలి



సమావేశంలో పాల్గొన్న నాయకులు

నడిగూడెం : కల్లుగీత కార్మికులకు ప్రభుత్వం రక్షణ, కుటుంబాలకు భరోసా కల్పించాలని ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బెల్లంకొండ వెంకటేశ్వర్లు అన్నారు. గురువారం మండలంలోని రత్నవరంలో కల్లుగీత కార్మికులకు ప్రమాదాలు జరగకుండా సేఫ్టీ మోకుపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కల్లుగీత కార్మికులు వృత్తిలో వందలాది మంది తాటిచెట్ల పైనుంచి పడి ప్రమాదాలబారిన పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం గీత కార్మికులకు సేఫ్టీ మోకులు ఉచితంగా ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రమాదంలో చనిపోయిన వారి కుటుంబాలకు ప్రభుత్వం రూ.10లక్షల ఎక్స్‌గ్రేషియా నెలరోజుల లోపు ఇవ్వాలని, మెడికల్ బోర్డు నిబంధన తొలగించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో గౌడ సంఘం నాయకులు పోలంపల్లి వెంకటేశ్వర్లు, కల్లుగీత కార్మికులు ఎం.పిచ్చయ్య, ఎం.గోపయ్య, జి.నరసయ్య, జి.రామచంద్రయ్య, జి.వెంకటేశ్వర్లు, బి.లింగయ్య, ఎం.ఆంజనేయులు, ఎం.వెంకటయ్య, ఎం.ఉపేందర్, జి.శ్రీను, శంకర్, రాంబాబు, సీతారాములు, రాజలింగయ్య, రాంబాబు, గురవయ్య, రాముడు, తదితరులు పాల్గొన్నారు.

బడ్జెట్‌లో అధిక నిధులు కేటాయించాలి



సమావేశంలో మాట్లాడుతున్న రాజేష్

మునగాల : రాష్ట్ర బడ్జెట్‌లో దివ్యాంగులకు అధిక నిధులు కేటాయించాలని డిప్యూటీ సీఎం, ఆర్థికశాఖ మంత్రి మల్లు భట్టివిక్రమార్కను భారత వికలాంగుల హక్కుల పరిరక్షణ సమితి (బీవీహెచ్‌పీఎస్) రాష్ట్ర అధ్యక్షుడు గిద్దె రాజేష్ కోరారు. గురువారం మండలంలోని తిమ్మారెడ్డిగూడెంలో నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. దివ్యాంగులకు భరోసా కల్పించేలా బడ్జెట్‌లో నిధులు కేటాయించకుంటే ఆర్థికమంత్రి భట్టి విక్రమార్క ఇంటిని ముట్టడిస్తామని హెచ్చరించారు. తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రవేశపెట్టబోతున్న తొలి బడ్జెట్‌లో దివ్యాంగుల సంక్షేమానికి అధిక నిధులు కేటాయించాలని త్వరలో భట్టి విక్రమార్కను కలిసి వినతిపత్రం అందజేయనున్నట్లు తెలిపారు. సమావేశంలో సంఘం మండల అధ్యక్షుడు మదన్‌మోహన్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు కుర్రా గోపియాదవ్, సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కొల్లూరి యాదయ్యబాబు, సంఘం నాయకులు సోమిరెడ్డి సైదిరెడ్డి, బలుపూనూరి శ్రీనివాసరెడ్డి, తిమ్మారెడ్డి ఏసురెడ్డి, ఎర్ర నాగలక్ష్మి, కేతిరెడ్డి పిచ్చిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు భద్రత నియమాలు పాటించాలి



కోదాడరూరల్ : ఆటోడ్రైవర్లకు అవగాహన కల్పిస్తున్న డీఎస్పీ ప్రకాష్

కోదాడరూరల్ : ఆటోడ్రైవర్లు రోడ్డు భద్రత నియమాలు తప్పక పాటించాలని డీఎస్పీ ప్రకాష్ సూచించారు. గురువారం పట్టణంలో ఆటోడ్రైవర్లకు రోడ్డు భద్రత వారోత్సవాల సందర్భంగా నిర్వహించిన అవగాహన సమావేశంలో ఆయన మాట్లాడారు. రోడ్డు ప్రమాదాలకు కారణం నిబంధనలు పాటించకపోవడమేనని అన్నారు. మద్యం తాగి, రాంగ్‌రూట్‌లో, సెల్‌ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయొద్దన్నారు. అదే విధంగా డ్రైవర్లు విధిగా లైసెన్స్‌లు కలిగి ఉండాలని, వాహనపత్రాలను తమవద్ద ఉంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సమావేశంలో పట్టణ సీఐ రాము, ట్రాఫిక్ ఎస్‌ఐ రాంబాబు, ఎస్‌ఐలు రామాంజనేయులు, యాదవేంద్ర రెడ్డి, ట్రాఫిక్ సిబ్బంది తదితరులు ఉన్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణపై అవగాహన

అనంతగిరి : రోడ్డు ప్రమాదాల నివారణపై అవగహన కలిగిఉండాలని ఎస్‌ఐ అనిల్‌రెడ్డి అన్నారు. గురువారం మండల పరిధిలోని శాంతినగర్, కోదాడ హైవేపై జాతీయ రోడ్డు భద్రతా వారోత్సవాల సందర్భంగా ఆటోడ్రైవర్లు, ప్రయాణికులకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఆటోడ్రైవర్‌లు, ప్రయాణికులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం



సమావేశంలో మాట్లాడుతున్న రంగాచార్యులు

గరిడేపల్లి : యోగాతో సంపూర్ణ ఆర్యోగం లభిస్తుందని ప్రముఖ ఆయుర్వేద వైద్య సేవారత్న, ఆరోగ్య భారతి వైస్‌ప్రెసిడెంట్ ఎన్‌సీ రంగాచార్యులు అన్నారు. గురువారం మండల పరిధిలోని గడ్డిపల్లి కేవీకేలో యోగాపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఆరోగ్యంగా ఉండానికి జబ్బులు రాకుండా, వచ్చిన తర్వాత తీసుకోవాల్సిన జాగ్రత్తలు, మన దినచర్యలో పాటించాల్సిన విషయాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కేవీకే ఇన్‌చార్జ్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ డి.నరేష్, కిరణ్, మాధురి, ఆదర్శ్, సుగంధి, మహిళలు, విద్యార్థులు పాల్గొన్నారు.

దాతల సహకారాన్ని సద్వినియోగం చేసుకోవాలి



అల్పాహార కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఎంఈఓ

నేరేడుచర్ల : పదోతరగతి విద్యార్థులు దాతల సహకారాన్ని సద్వినియోగం చేసుకొని, మంచి ఫలితాలు సాధించాలని మండల విద్యాధికారి చత్రునాయక్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో నేరేడుచర్ల, గరిడేపల్లి, పాలకవీడు మండలాల్లోని 18జెడ్పీ ఉన్నత పాఠశాలల్లోని పదోతరగతి విద్యార్థులకు ఉదయం, సాయంత్రం లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో అందించే అల్పాహార కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల అల్పాహార దాత కొణతం సత్యనారాయణరెడ్డి, పాఠశాల హెచ్‌ఎం బట్టు మధు, కుంట్లూరు సత్యనారాయణరెడ్డి, ఎల్. శ్రీనివాస్‌రావు, బాలునాయక్, ఉపేందర్, కృష్ణయ్య, వెంకటేశ్వర్లు, వెంకట్‌రెడ్డి, సీవీ రావు, దాతలు సీతారాములు, శ్రీనివాస్‌రావు, ఉపేందర్, వెంకటేశ్వర్లు, ఈశ్వరయ్య, క్లబ్ సభ్యులు, ఉపాధ్యాయులు తదితరులున్నారు.

ఘనంగా మాసకల్యాణం



స్వామివారి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

మేళ్లచెరువు : మండల కేంద్రంలోని శ్రీ ఇష్టకామేశ్వరీ సమేత శ్రీస్వయంభూ శంభు లింగేశ్వరస్వామి దేవాలయంలో గురువారం మాసకల్యాణాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు దేవాలయంలో స్వామివార్ల విగ్రహాలకు పూలతో, పట్టువస్త్రాలతో అంలకరించారు. అనంతరం పుణ్యావచనం, పంచామృతాభిషేకాలు, మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం, అమ్మవారికి కుంకుమార్చనలు నిర్వహించారు. అనంతరం కల్యాణ ఘట్టాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఈఓ కొండారెడ్డి, అర్చకులు కొంకపాక విష్ణువర్ధన్‌శర్మ, ధనుంజయశర్మ, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

16న దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలి



హుజూర్‌నగర్ : సమావేశంలో పాల్గొన్న నాయకులు



చిలుకూరు : సమావేశంలో మాట్లాడుతున్న వెంకటేశ్వర్లు



కోదాడ : మున్సిపల్ కమిషనర్‌కు సమ్మె నోటీస్ ఇస్తున్న సీఐటీయూ నాయకులు

హుజూర్‌నగర్ : కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈనెల 16న నిర్వహించనున్న దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని ఆల్ ట్రేడ్ యూనియన్ నాయకులు అన్నారు. గురువారం పట్టణంలోని ఐఎన్‌టీయూసీ నియోజకవర్గ అధ్యక్షుడు బెల్లంకొండ గురవయ్య అధ్యక్షతన అఖిలపక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో వారు పాల్గొని మాట్లాడారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్పొరేట్, మతతత్వ విధానాల ప్రతిఘటనకు పూనుకోవాలని కార్మికులకు పిలుపునిచ్చారు. సమావేవంలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు జడ శ్రీనివాస్, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు శీలం శ్రీను, బీఆర్‌టీయూ నియోజకవర్గ అధ్యక్షుడు పచ్చిపాల ఉపేందర్, ఐఎన్‌టీయూసీ మండల అధ్యక్షుడు మేళ్లచెరువు ముక్కంటి నాయకులు వెంకటేశ్వర్లు, వై.సోమయ్య, జె.ప్రసాద్, మల్లయ్య, తిరపయ్య, రాము పాల్గొన్నారు.

కోదాడ : కార్మికుల హక్కులను కాలరాసే విధంగా వ్యవహరిస్తున్న కేంద్ర ప్రభుత్వ చర్యలకు నిరసనగా ఈనెల 16న జరిగే దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని సీఐటీయూ నాయకులు కోరారు. గురువారం స్థానిక మున్సిపల్ కమిషనర్‌కు సమ్మె నోటీస్‌ను అందజేసిన అనంతరం వారు మాట్లాడారు. అనేక త్యాగాలు, పోరాటాలతో సాధించుకున్న కార్మిక చట్టాలను రద్దు చేసి వాటి స్థానంలో లేబర్ కోర్డులను ఏర్పాటు చేయడం, కార్మికులకు కనీస వేతనాలు నిర్ణయించే విధానానికి స్వస్తిపలకడం అన్యాయమన్నారు. కార్యక్రమంలో ఎం.ముత్యాలు, ప్రమీల, రాజ్యలక్ష్మి, అరుణాంజలి, అరుణ, రాణి, దుర్గ, రాజేశ్వరి పాల్గొన్నారు.

గ్రామీణ భారత్ బంద్‌కు మద్దతు

చిలుకూరు : బీజేపీ ప్రభుత్వం వైఫల్యాలపై దేశ వ్యాప్తంగా ఈనెల 16న చేపట్టనున్న గ్రామీణ భారత్ బంద్‌కు సమ్మెకు సీపీఐ సంపూర్ణ మద్దతు తెలుపుతున్నట్లుగా ఆ పార్టీ జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు అన్నారు. బుధవారం మండల పరిధిలోని బేతవోలులోని పార్టీ కార్యాలయంలో జరిగిన ముఖ్యనాయకులు సమావేశంలో ఆయన మాట్లాడారు. పెరుగుతున్న ధరలను నియంత్రించడంలో కేంద్ర ప్రభుత్వం విఫలమైందన్నారు. బీజేపీ అధికారంలోకి వచ్చి 10ఏళ్లైనా నేటి వరకు కార్మికుల సమస్యలను పరిష్కరించలేదని మండిపడ్డారు. సమావేశంలో పార్టీ కార్యదర్శి పొరండ్ల ముత్తయ్య, నాయకులు తాళ్లూరి వెంకటయ్య, పోరెండ్ల ఉపేందర్, పెద్ద మల్లయ్య, తాళ్లూరి రామారావు, నేలపట్ల జనార్దన్, జానయ్య, శ్రీను, వీరబాబు పాల్గొన్నారు.

ఖాతాదారులకు సేవలు అందించమే లక్ష్యం



మాట్లాడుతున్న ఆర్‌ఎం శాంతికుమార్

హుజూర్‌నగర్ : ఖాతాదారులకు మెరుగైన సేవలు అందించడమే కెనరా బ్యాంక్ లక్ష్యమని ఆ బ్యాంక్ వరంగల్ రీజనల్ మేనేజర్ శాంతికుమార్ అన్నారు. గురువారం పట్టణంలోని కెనరా బ్యాంక్ నూతన బ్రాంచ్‌ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. బ్యాంకింగ్ రంగంలో కెనరాబ్యాంక్ దేశంలోనే మూడో స్థానంలో ఉందన్నారు. దేశవ్యాప్తంగా 9,585 బ్రాంచీలు కలిగి రూ.22లక్షల 13వేల 360కోట్ల లావాదేవీలను జరుపుతుందని వెల్లడించారు. అదేవిధంగా తమ బ్యాంకులో వ్యవసాయానికి, వాహనాల కొనుగోలుకు, వ్యక్తిగత రుణాలు, గోల్డ్‌లోన్లు ఇవ్వనున్నట్లు తెలిపారు. ప్రజలు తమ బ్యాంకు సేవలను వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో డివిజనల్ మేనేజర్ ఫణిందర్‌కుమార్, బ్రాంచ్ మేనేజర్ సత్యంబాబు, అసిస్టెంట్ మేనేజర్ హరి, స్థానికులు కల్వకొలను ప్రసాద్, కల్వకొలను సుధాకర్, మాజీ సర్పంచ్ గొట్టె రామయ్య, నాయకులు సామల శివారెడ్డి, గజ్జి ప్రభాకర్‌బాబు, పోలిశెట్టి వెంకటేశ్వర్లు, పాలకూరి బాబు, మామిడి వెంకయ్య, హెచ్‌ఎం శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

విద్యార్థులు కష్టపడి చదవాలి

నేరేడుచర్ల : విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత విద్యను అభ్యసించి జీవితంలో స్థిరపడాలని స్పందన కళాశాల ప్రిన్సిపల్ యడవల్లి వెంకట్‌రెడ్డి అన్నారు. గురువారం స్థానిక స్పందన జూనియర్ కళాశాలలో నిర్వహించిన వీడ్కోలు సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. రానున్న వార్షిక పరీక్షల్లో విద్యార్థులు కష్టపడి చదివి మంచి ఫలితాలు సాధించాలన్నారు. అనంతరం విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతి కార్యక్రమాలు పలువురు అలరించాయి. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ కట్టా ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, అధ్యాపకులు సతీష్, శ్రీధర్, నాగప్రసాద్, ఆంజనేయులు, చారీ, నగేష్, లింగారెడ్డి తదితరులున్నారు.

మండలంలోని చిల్లేపల్లిలో గల బీసీ బాలికల గురుకుల పాఠశాలలో నిర్వహించిన పదోతరగతి విద్యార్థుల వీడ్కోలు సమావేశంలో మండల విద్యాధికారి పి.చత్రునాయక్ పాల్గొని మాట్లాడారు. విద్యతోనే విద్యార్థులకు మంచి భవిష్యత్ ఉంటుందని, బాగా కష్టబడి చదివి మంచి ఫలితాలను సాధించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ వెంకటయ్య, మాజీ సర్పంచ్ బూషిపల్లి వెంకట్‌రెడ్డి, ప్రిన్సిపల్ అనిత, రేణుక, త్రివేణి తదితరులున్నారు.


ఉచిత వైద్యశిబిరం

కోదాడ : పట్టణంలోని కల్యాణి డెంటల్ క్లీనిక్‌లో పందిరి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈనెల 12న ఉచిత కంటి, దంత వైద్యశిబిరం నిర్వహించనున్నట్లు ఫౌండేషన్ చైర్మన్ పందిరి నాగిరెడ్డి గురువారం తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఫౌండేషన్ కార్యదర్శి ఇమ్మడి సతీష్ బాబు, గౌరవ సలహాదారు ఎస్‌ఎస్‌రావు తెలిపారు. వివరాలకు 94400 33633ను సంప్రదించాలని తెలిపారు.

మండప నిర్మాణానికి విరాళం

నడిగూడెం : మండల కేంద్రంలోని శ్రీకోదండరామ స్వామి ఆలయానికి అనుబంధంగా నిర్మించనున్న శ్రీసీతారామ కల్యాణ మండపానికి మండల కేంద్రానికి చెందిన వందనపు మోహన్‌రావు కళ దంపతులు రూ.50,116లు విరాళాన్ని గురువారం ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. అదే విధంగా మండల కేంద్రానికి చెందిన పెండెం శ్రీనివాస్ జ్ఞాపకార్థంగా 50సిమెంట్ బస్తాలను అందజేయనున్నట్లు అతడి భార్య శ్రీకళ, వరంగల్‌కు చెందిన లక్ష్మణరావు, అనురాధ దంపతులు 100సిమెంట్ బస్తాలు అందజేస్తామని ప్రకటించినట్లు కమిటీ సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు భౌరిశెట్టి వెంకటరత్నం, కేవీఎస్‌ఎన్ గుప్త, సూర్యప్రకాషరావు, అప్పారావు, దయాకర్ ఉన్నారు.

మోహనసాయికి సన్మానం



మోహనసాయిని, అతడి తండ్రిని సన్మానిస్తున్న కౌన్సిలర్ సంపత్‌రెడ్డి

హుజూర్‌నగర్ : పట్టణానికి చెందిన ఆకుల మోహనసాయి లునారెస్ అనలాగ్ ఆస్ట్రోనాట్ మిషన్‌కి భారతదేశం నుంచి రెండోసారి ఎంపిక కావడం హర్షణీయమని కౌన్సిలర్ కోతి సంపత్ రెడ్డి అన్నారు. గురువారం పట్టణానికి వచ్చిన మోహనసాయిని, అతడి తండ్రి శ్రీనివాస్‌ను అభినందించి శాలువాతో సన్మానించారు. మోహనసాయి వచ్చే నెలలో పోలాండ్ దేశంలో లునారీస్ రీసెర్చ్ స్టేషన్‌కి 25రోజుల శిక్షణకు రెండోసారి ఎంపికైనట్లు తెలిపారు.

ఎత్తిపోతల పథకాలను ప్రభుత్వమే నిర్వహించాలి

నడిగూడెం : నాగార్జునసాగర్ ప్రాజెక్టు పరిధిలోని ఎత్తిపోతల పథకాలను ప్రభుత్వమే నిర్వహించాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా నాయకుడు ఏనుగులు వీరాంజనేయులు అన్నారు. గురువారం మండల కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎత్తిపోతల పథకాలను నిర్వహిస్తామని గత ప్రభుత్వాలు హామీ ఇచ్చి అమలు చేయకపోవడంతో లక్షల ఎకరాల సాగుభూములు బీళ్లుగా మారాయన్నారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీల ప్రకారం సాగర్ ఎడమకాలువపై ఉన్న ఎత్తిపోతల పథకాలను ప్రభుత్వమే నిర్వహించి ఆయకట్టు రైతాంగాన్ని ఆదుకోవాలని, తాగునీటి సమస్య రాకుండా చూడాలన్నారు.

సంక్షిప్త సమాచారం

మంత్రి ఉత్తమ్ సహకారంతో అభివృద్ధి

మఠంపల్లి : మండలంలోని అన్ని గ్రామాల్లో కోట్లాది రూపాయలతో రాష్ట్ర భారీ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సహకారంతో మండలం శరవేగంగా అభివృద్ధి చెందనున్నట్లు కాంగ్రెస్ మండల అధ్యక్షుడు భూక్యా మంజీనాయక్ అన్నారు. గురువారం మండలంలోని కొత్తదొనబండతండా గ్రామ పంచాయతీలో ఉపాధిహామీ నిధులు రూ.5లక్షలతో చేపట్టిన సీసీరోడ్డు పనులను స్థానిక సర్పంచ్ విజయాబాలానాయక్‌తో కలిసి ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో డీసీసీ ఎస్టీ సెల్ మాజీ అధ్యక్షుడు నవీన్‌నాయక్, సోముడు, భాస్కర్‌నాయక్, కిషన్‌నాయక్, కోటేష్‌నాయక్ పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత పాటించాలి

హుజూర్‌నగర్‌రూరల్ : గ్రామాల్లో ప్రజలందరూ పరిసరాల పరిశుభ్రతను పాటించాలని గ్రామ ప్రత్యేక అధికారి డాక్టర్ శ్రీనివాసరెడ్డి అన్నారు. గురువారం మండల పరిధిలోని వేపలసింగారంలో ఆయా వీధుల్లో పెరిగిన పిచ్చిమొక్కలను సిబ్బందితో కలిసి తొలగించి మాట్లాడారు. ప్రజలు తమ ఇంటి పరిసరాల్లో ఉన్న చెత్తను వీధుల వెంట వేయకుండా చెత్తకుండీల్లో మాత్రమే వేయాలని ఆయన సూచించారు. అనంతరం నర్సరీని పరిశీలించారు. కార్యక్రమంలో కార్యదర్శి గిరిజ, అంగన్‌వాడీ టీచర్లు, ఆశకార్యకర్తలు, జీపీ సిబ్బంది పాల్గొన్నారు.

కేసీఆర్ ప్రజలకు క్షమాపణ చెప్పాలి

మునగాల : నాగార్జునసాగర్ ప్రాజెక్ట్‌ను అవమానించిన మాజీ సీఎం కేసీఆర్ ఉమ్మడి నల్లగొండ జిల్లా ప్రజలకు క్షమాపణ చెప్పి నల్లగొండలో నిర్వహించే సభకు రావాలని కాంగ్రెస్ నాయకుడు రాయిల కృష్ణ అన్నారు. గురువారం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు.

దివ్యాంగులకు బస్‌పాస్‌ల పంపిణీ

గరిడేపల్లి : మండల కేంద్రంలో లయన్స్ క్లబ్ ఆఫ్ నేరేడుచర్ల ఆధ్వర్యంలో మండలంలోని 50మంది దివ్యాంగులకు క్లబ్ అధ్యక్షుడు చల్లా ప్రభాకర్‌రెడ్డి, మిర్యాలగూడ ఆర్టీసీ డిపో అసిస్టెంట్ మేనేజర్ ఆర్.సంధ్యారాణి గురువారం ఉచితంగా బస్‌పాస్‌లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి జిలకర రామస్వామి, సభ్యులు గంట రంగారెడ్డి, ఆర్టీసీ డిపో ఉద్యోగులు మాతంగి సోమయ్య, వెంగల్‌రెడ్డి రామయ్య పాల్గొన్నారు.

సత్యనారాయణ సేవలు మరువలేనివి

కోదాడరూరల్ : సీపీఐ పార్టీ బలోపేతానికి, తమ్మర గ్రామ అభివృద్ధికి తమ్మినేని సత్యనారాయణ చేసిన సేవలు మరువలేనివని ఏఐటీయూసీ నాయకుడు పోతురాజు సత్యనారాయణ, జీవీ రాజు అన్నారు. గురువారం పట్టణ పరిధిలోని తమ్మరలో సత్యనారాయణ 18వ వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో స్థూపం వద్ద పార్టీ జెండాను ఎగురవేసి వారు మాట్లాడారు. కార్యక్రమంలో కౌన్సిలర్ సామినేని నరేష్, గ్రామ కార్యదర్శి మాతంగి ప్రసాద్, కొండ కోటేశ్వరరావు, నిడిగొండ రామకృష్ణ, గాంధీ, శ్రీనివాసరావు, శ్రీను, లక్ష్మీనారాయణ, భిక్షమయ్య ఉన్నారు.

పేద ప్రజలకు అండగా కాంగ్రెస్

అనంతగిరి : కాంగ్రెస్ పార్టీ పేద ప్రజలకు అండగా ఉంటుందని ఆ పార్టీ మండల అధ్యక్షుడు ముస్కు శ్రీనివాసరెడ్డి అన్నారు. మండలంలోని శాంతినగర్ అంగన్‌వాడీ కేంద్రంలో ఇటీవల పప్పుకుక్కర్ పేలి గాయపడిన చిన్నారి నీలం అభినవ్ కుటుంబాన్ని పరామర్శించి గురువారం రూ. 20వేల ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు గునుకుల గోపాల్‌రెడ్డి, బాబునాయక్, పుల్లారెడ్డి, నర్సింహరెడ్డి, రఘువరెడ్డి, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు నాగుల్‌మీర, కృష్ణయ్య ఉన్నారు.